రామశాస్త్రి తండ్రి పేరిశాస్త్రిలా సోమయాజి కాకపోయినా కర్మిష్ఠి. పదిహేనేళ్ళ వయసుకే వేదం ఎనభై రెండు పన్నాలు ఆపోశనపట్టాడు. ఆ పైన తర్కం అభ్యసిస్తూ అంతో యింతో వేదార్థం కూడా గ్రహించాడు.

వటువుగా త్రికాలములందు అగ్నిహోత్రాన్ని ఆరాధిస్తూ గాయత్రి మంత్రోపాసన ఉచ్ఛ్వాస నిశ్వాసాలుగా కాలం గడుపుతున్నాడు. సభల్లో ఎందరు పెద్దలున్నా పిన్నవాడైన రామశాస్త్రికి పెద్ద పీట వేసేవారు.


పేరిశాస్త్రి కొడుక్కి వయసొచ్చింది గదా, వివాహం చేద్దామని సంకల్పించాడు. కాని రామశాస్త్రి మనస్సు వివాహం వద్దన్నది. 'సంసారం తుచ్ఛమైంది' అని మనస్సు పదే పదే చెప్తున్నా తండ్రి ఆన కాదనడం ధర్మ సమ్మతం కాదని పెళ్ళికి ఒప్పుకున్నాడు. అప్పటిదాకా బ్రహ్మచారిగా వున్న రామశాస్త్రికి దోవతి కట్టుకోటం చేతకాకపోతే, పెళ్ళి పీటలమీద పురోహితుడే కుచ్చిళ్ళు పోసి రామశాస్త్రికి ధోవతి కట్టవలసివచ్చింది. తల్లి దండ్రుల కోరిక తీర్చటం కోసం పిల్ల మెళ్ళో తాళి కట్టాడే కాని, పెళ్ళయింతర్వాత మళ్ళీ తన జపమేమో! తన అనుష్ఠానమేమో!

పేరిశాస్త్రి దంపతులు కొడుకు పెళ్ళి చూడ్డానికే నోచుకున్నారు గాని, కోడల్ని గడపలోకి తెచ్చుకునే సంబరం చూడకుండానే వెళ్ళిపోయారు. అత్తా, మామ లేని యింట శ్రీదేవమ్మ కోడలుగా అడుగుపెట్టింది. రామశాస్త్రికి దీటైన ఇల్లాలు శ్రీదేవమ్మ. రామశాస్త్రి జపాలకీ, తపాలకీ రోజుకి ఆరు గంటలు పట్టేది. శ్రీదేవమ్మ అత్తింటికొస్తూ కామాక్షి విగ్రహాన్ని తన తోనే తెచ్చుకుంది. ఆమె సేవే అనునిత్యం. ఇక రామశాస్త్రి అనుక్షణ ఈశ్వరార్చకుడు. రామశాస్త్రి భార్యతో 'నాకిది కావాలి' అనడగడు. ఆమె ఏం చేసి పెడ్తే అది తింటాడు. శ్రీదేవమ్మ కామాక్షి విగ్రహాన్ని 'అమ్మా! నీ నివేదనకి ఏం చేయమంటావ్?' అనడిగి తోచింది చేస్తుంది. రామశాస్త్రి జపమైపోయినా శ్రీదేవమ్మ పూజకాక, భోజనానికి పిలవకపోతే రామశాస్త్రి 'తండ్రీ! నా జపం చాలలేదా!' అనుకుని తిరిగి పంచాక్షరి మొదలెట్టేవాడు. వూరందరికీ వాళ్ళు భార్యాభర్తలే కాని, వాళ్ళెప్పుడూ అలా అనుకోలేదు. ఎవరి జపం వారిది. రామశాస్త్రికి ఈశ్వర ధ్యానం. శ్రీదేవమ్మకి కామాక్షి స్తవం. కాని, ఈశ్వరుడూ, కామాక్షీ ఆది దంపతులని వాళ్ళ కెన్నడూ తట్టలేదు.

# మళ్ళీ అమరావతి కథలు

## సత్యం శంకరమంచి

ఒక రోజున రామశాస్త్రి పొలం వెళ్ళవలసిన పని రావటంచేత కృష్ణ స్నానానికి మధ్యాహ్నం పదకొండు గంటలవేళ వచ్చాడు. అప్పటికి కృష్ణ రేవంతా నిర్మానుష్యంగా వుంది. రామశాస్త్రి రాగిచెంబు తోముకుని ఒడ్డున బోర్లించి, అంగోస్త్రం నడుంకి చుట్టి ఒక్క మునక వేసి పక్కకి చూస్తే ఓ బండ మీద ఓ ఉప్పర పిల్ల స్నానం చేస్తూ కన్పించింది. ఆ నల్లపిల్ల మంచి వయసులో వుంది. ఉతికిన గుడ్డలు ప్రక్కన పడేసి నామమాత్రంగా ఓ చిన్న గుడ్డ మొలకి చుట్టుకుని హాయిగా, స్వేచ్ఛగా



## ఎంగిలా?

వెచ్చటి ఎండలో కృష్ణలో మునకవేస్తోంది (చాలీ చాలని గుడ్డ పొంగుతున్న వక్షాల్ని దాచలేకపోతోంది). పక్కనో మగమనిషి వున్నాడన్న ధ్యాసే లేకుండా వొళ్ళంతా రుద్దుకుంటూ చెంగున నీళ్ళలోకి దూకి ఈదుకుంటూ మళ్ళీ బండమీది కొస్తోంది.

రామశాస్త్రి ఆ నల్లపిల్లని ఆ రీతిలో చూడగానే లోపలేదో కలుక్కు మంది. మనసు బిగించుకుని మరో మునకేసి సూర్యుడికి ఆర్ఘ్యమిచ్చాడు. నోట మంత్రం నడుస్తోందే కాని, మనసు ఆ నల్లపిల్ల వైపే పరుగు తీస్తోంది.

ఫెళ్ళుమనే వయసు ఆ నల్లపిల్లది.

కృష్ణలో సుళ్ళులా వొంటి వొంపులు!

తరుముకొస్తున్న కెరటంలా నవ్వులు!

బారలు బారలుగా ఈదుతోంది నల్లపిల్ల.

నల్లటి కృష్ణలో నల్లచేపలా దూసుకుపోతోంది.

రామశాస్త్రికి గాయత్రి సాగటం లేదు. మళ్ళీ మళ్ళీ పక్కకి తిరిగి చూస్తున్నాడు. ఇంకెవరో చూస్తున్నారన్న ధ్యాసే లేకుండా స్వేచ్ఛగా, ఆనందంగా కృష్ణలో కలిసిపోతోంది ఆ పిల్ల. 'కృష్ణ అంత అందంగా వుంది ఆ కన్నె!' అనిపించింది రామశాస్త్రికి. కకావికలైన మనస్సుతో వొడ్డుకొచ్చాడు రామశాస్త్రి.

శ్రీదేవమ్మ అన్నం వడ్డిస్తుంటే భార్యని తదేకంగా చూశాడు. పచ్చటి ముఖం మీద పెద్ద కుంకం బొట్టు. కామాక్షీదేవికి పూజ చేసిన గన్నేరు పువ్వు ఆమె కొప్పులో ఎత్తుగా విచ్చుకుని వుంది. 'నల్లపిల్లే కాదు శ్రీదేవి కూడా అందంగా వుంటుంది!' అనిపించి కళ్ళు విచ్చుకు చూస్తున్నాడు రామశాస్త్రి. అన్నం కలిపి ఓ ముద్ద నోట్లో పెట్టుకుని రెండో ముద్ద పక్కనే కూర్చుని విసనకర్రతో విసురుతున్న భార్య నోటికి అందించాడు. శ్రీదేవమ్మ అబ్బురపడి 'ఎంగిలి కాదో?' అంది.

'ప్రసాదమనుకోరాదో?' అన్నాడు రామశాస్త్రి.

'అయితే అనుగ్రహించండి' అని నోరందించడానికి బదులు దోసెడు పట్టింది. రామశాస్త్రి ముద్ద దోసిట్లో వుంచితే కళ్ళకద్దుకుని నోట్లో వేసుకుంది ఆమె.

రామశాస్త్రి సాయంత్రం దైవ దర్శనానికి వెళ్తున్నాడు గాని, లోపల అనేక సందేహాలు. గుడినిండా స్త్రీలు. వాళ్ళ జడల్లోని పూలచెండ్ల వాసన మండపం నిండా పరచుకుంది. ధ్వజ స్తంభం దగ్గర ఆరుబయల్లో కూర్చున్నా పూలవాసనే.

గాలి పూల వాసన.

వెన్నెల పూల వాసన.

వస్తూ వస్తూ అప్పయ దీక్షితులవారు అరుగుమీద కూర్చుంటే నుంచునే ప్రశ్నించాడు రామశాస్త్రి "తాతా! సంసారం విషవృక్షం కాదా?"

అప్పయ దీక్షితులు గడ్డం చాటున నవ్వుకుని "విష వృక్షమే! ఆ విష వృక్షానికే అమృత ఫలాలు కాస్తాయి" అన్నాడు.

మరి కొంతసేపటికి రామశాస్త్రి "తెలిసి తెలిసి చేదు తింటామా?" అనడిగాడు.

"చేదు తెలిసిన నోటికే తీపి రుచి బాగా తెలుస్తుందిరా" అన్నాడు.

రామశాస్త్రి ఇంటికొచ్చాడు. భోంచేసి తుంగచాప మీద పడుకుంటే భార్య కాసేపు కాళ్ళొత్తి, దణ్ణం పెట్టి, మంగళసూత్రాలు కళ్ళకద్దుకొని మామూలుగా వెళ్ళబోతుంటే అన్నాడు.

'పార్వతీదేవి భర్త సేవ చేసి వేరే వెళ్ళిపోయేదా?'

'ఆ సంగతి కామాక్షీదేవి నడగాలి' అంది శ్రీదేవమ్మ.

'అడగనక్కరలేదు. నాకు ఈశ్వరుడు చెప్పాడులే' అంటూ భార్యని దగ్గరకు తీసుకున్నాడు.

ఆనాటి నుంచీ శ్రీదేవమ్మకి వేరే చాపతో పని లేకపోయింది. మరి రెండు సంవత్సరాలలో ఆ ఇంట అమరేశ్వరుడు, బాల చాముండేశ్వరీ పుట్టారు.

*

ముత్యాలవాన